సాక్షి
కర్నూలు
శుక్రవారం : 20 : జూన్ : 2025



ఇళ్లల్లో 'పేడ' పాషాణం!
కృత్రిమ పేడరంగు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కొన్నిసార్లు ఇది ప్రాణాంతకం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. 10లో▸



టీబీ డ్యాంకు పోటెత్తిన వరద
కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో ఇన్‌ఫ్లో మెరుగుపడింది. నీటి నిల్వ దాదాపు 40 టీఎంసీలకు చేరుకుంది. జూలై మొదటి వారంలో కాలువలకు నీటిని వదలనున్నట్లు తెలుస్తోంది. 10లో▸



జూలై 25 నుంచి ఉత్సవాలు
ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో జూలై 25 నుంచి ఆగస్టు 23 వరకు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. సేవ చేసే వారి కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 10లో▸

జలాశయాల్లో కన్నీళ్లు!


వెలవెలబోతున్న బసలదొడ్డి జలాశయం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా గురురాఘవేంద్ర ప్రాజెక్టులో ఇసుమంత అభివృద్ధి కనిపించలేదు. పనిచేయని పంపుహౌస్‌లు, చోరీకి గురైన ప్రాజెక్టు సామగ్రి 'విధ్వంస' పాలనను చూపుతున్నాయి. వరుణుడు కరుణించినా జలాశయాలు వెలవెలబోతున్నాయి. ఆయకట్టు భూములు బీళ్లను తలపిస్తున్నాయి. పంట పొలాల్లో రైతుల కన్నీళ్లే పారుతున్నాయి. అయినా సీఎం చంద్రబాబు స్పందించడం లేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం ఎమ్మిగనూరులో గురురాఘవేంద్ర ప్రాజెక్టు కార్యాలయం ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

- గురురాఘవేంద్ర ప్రాజెక్టును పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పనిచేయని జీఆర్‌పీ పంపుహౌస్‌లు
- ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌లు
- వెలవెలబోతున్న ఎత్తిపోతల పథకాలు
- మరమ్మతులకు అందని నిధులు
- గురురాఘవేంద్ర ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

మంత్రాలయం: తుంగభద్ర దిగువ కాలువ శివారు ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు గురురాఘవేంద్ర ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు పరిధిలో ఒక మైనర్ ఇరిగేషన్, 11 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. జిల్లా పశ్చిమ ప్రాంతంలోని 50 వేల ఎకరాలకు నీరందించాల్సి ఉంది. నీరందక గతేడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరి ఆయకట్టు భూములను బీళ్లుగా పెట్టుకున్నారు. తీవ్ర కరువుతో చాలా మంది చిన్న, సన్నకారు రైతులు ఉన్న ఊరిని వదిలి జీవనోపాధి నిమిత్తం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రాష్ట్ర ప్రభుత్వంలో కనీస స్పందన కరువైంది. గురురాఘవేంద్ర ప్రాజెక్టును రైతులకు తీసుకొచ్చేందుకు మరమ్మతులకు నిధులను కూడా కేటాయించలేదు.

వర్షాధారమే ఆధారం

ముఠా చోరీల కారణంగా ఆరు ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యమయ్యాయి. పంపుహౌస్‌ల మరమ్మతుల కోసం రూ.17 కోట్లు అంచనాతో ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపి ఏడాది కావొస్తున్నా కూటమి ప్రభుత్వం కరుణించడం లేదు. కేవలం రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి (ఎస్‌డీఎంఎఫ్) కింద రూ.1.28 కోట్లు మాత్రమే మంజూరు చేసి చేతులు దులుపుకుంది.

ప్రాజెక్టు స్వరూపం ఇదీ..

- గురురాఘవేంద్ర ప్రాజెక్టు కింద మంత్రాలయం నియోజకవర్గంలో మూగలదొడ్డి, దుద్ది, మాధవరం, బసలదొడ్డి ఎత్తిపోతల పథకాలు నిర్మించారు.
- 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సూగూరు జలాశయం నిర్మించి ప్రారంభించారు. అలాగే రూ.261.19 కోట్లతో పులికనుమ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.
- ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సోగనూరు, పూలచింత, చిలకలడోణ ఎత్తిపోతలు, కోడుమూరు నియోజకవర్గంలో ఏపీఎస్‌ఐడీసీ శాఖ పరిధిలో కృష్ణదొడ్డి, చింతమాన్‌పల్లె, రేమట, మునుగాల లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు నెలకొల్పారు.
- తుంగభద్ర నది నుంచి 5.373 టీఎంసీల నీటిని జలాశయాలకు ఎత్తిపోసి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది.


అలంకార ప్రాయంగా దుద్ది స్టేజ్-1 పంపుహౌస్

పథకం పరిధిలో 7 పనులు, జీతాలకు ఈ నిధి సరిపోయింది. ప్రభుత్వం చేతులెత్తేయడంతో గతేడాది మూగలదొడ్డి, పూలచింత పథకాలను రైతులే చందాలు వేసుకుని నడుపుకోవాల్సి వచ్చింది. ఇక చిలకలడోణ, మాధవరం, బసలదొడ్డి పథకాల నుంచి సెంటు భూమికి నీరివ్వలేదు. పథకాల పరిధిలో దాదాపు 20 వేల ఎకరాలు వర్షాధారంగా మారింది.

అన్నదాతల ఆందోళన బాట

కూటమి ప్రభుత్వ కాఠిన్యంపై రైతులు వేసారిపోయారు. రైతులంతా ఏకమై నిరసన బాట పట్టారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మిగనూరులోని గురురాఘవేంద్ర ప్రాజెక్టు కార్యాలయాన్ని 100 మంది రైతులు ముట్టడించారు. పంపుహౌస్‌ల్లో మరమ్మతులు చేపట్టి సాగునీరు ఇవ్వాలని వేడారు. తమకు సాగునీరు అందించపోతే వలసలే శరణ్యమని వాపోయారు.

దుస్థితి ఇలా...

- గతేడాది మహారాష్ట్ర దొంగల ముఠా దుశ్చర్యతో ప్రాజెక్టు పరిధిలోని ఆరు ఎత్తిపోతల పథకాల పంపుహౌస్‌ల్లో విలువైన సామగ్రి చోరీకి గురైంది. సామగ్రి సైతం దేనికీ పనికిరాకుండా ధ్వంసమైంది.
- మంత్రాలయం పరిధిలోని మూగలదొడ్డి స్టేజ్-1 పంపుహౌస్‌తో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి 1200 కేజీ కాపర్‌ను దొంగలించారు. పంప్‌హౌస్‌లో రూ.18 లక్షలు నష్టం వాటిల్లింది.
- మాధవరం స్టేజ్-1 పంపుహౌస్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు స్టార్టర్లు, ఇన్సులేటర్, బ్రేకర్స్, బ్యాటరీలను నాశనం చేశారు. అందులో 9 కాపర్ షీట్లను ఎత్తుకెళ్లారు. కారణంగా రూ.1.46 కోట్లు నష్టం జరిగింది.
- బసలదొడ్డి స్టేజ్-1 పంపుహౌస్‌లోనూ స్టార్టర్, బ్యాటరీలు, ఫీడర్లను ధ్వంసం చేయగా రూ.12 లక్షలు నష్టం వాటినట్లు కేసు నమోదైంది.
- ఎమ్మిగనూరు పరిధిలోని సోగనూరు స్టేజ్-1 పంపుహౌస్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 1200 కేజీల కాపర్‌ను దొంగలించారు. పంప్‌హౌస్‌లో రూ.20 లక్షలు నష్టం జరిగింది.
- పూలచింత స్టేజ్-1, స్టేజ్-2 పంపుహౌస్‌లోనూ 4 ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్, ఆయిల్ ఎత్తుకెళ్లగా రూ.40 లక్షలు నష్టం వాటిల్లింది.
- చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2 పంపుహౌస్‌లో 4 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్, ఆయిన్ తీసుకెళ్లగా రూ.40 లక్షలు నష్టం జరిగిందని ప్రాజెక్టు అధికారుల అంచనా వేశారు.

గురురాఘవేంద్ర ప్రాజెక్టు కింద సాగు విస్తీర్ణం మండలాల వారీగా..

మండలం	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
ఎమ్మిగనూరు	4,350
నందవరం	8,033
మంత్రాలయం	11,034
కోసిగి	8,566
పెద్దకడబూరు	1,420
సి.బెళగల్	6,825
గూడూరు	4,365
కర్నూలు	4,997

ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



ముందస్తు వర్షాలతో తుంగభద్ర నదిలో వరద నీరు పారుతూనే ఉంది. పంపుహౌస్‌ల మరమ్మతులు చేపట్టకపోవడంతో పథకాలన్నీ దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. నీరు ఎత్తిపోయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. మరమ్మతులు చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదు. ఇటీవల ప్రభుత్వం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలు, కేసీ కాలువ మైనర్ రిపేర్లకు నిధులు కేటాయించి గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు పైసా ఇవ్వక పోవడం దారుణం. జిల్లా పశ్చిమ ప్రాంత రైతులపై కూటమి ప్రభుత్వ కపట ప్రేమ తేటతెల్లమవుతోంది.
– గద్దం నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



పంపుహౌస్‌ల్లో జరిగిన చోరీలతో నిరుడు సాగునీరు అందించలేదు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం సరికాదు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ మొదలైంది. ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఇలాగే వదిలేస్తే వేలాది ఎకరాలు బీళ్లుగా మారే ప్రమాదం ఉంది. రైతుల వలస బాట పట్టేలా ఉన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే జలాశయాలకు నీటిని ఎత్తిపోయాలి. రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలి.
– రాముడు, సీపీఎం కోసిగి మండల కార్యదర్శి

ఇది రైతుల వ్యతిరేక ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: రైతుల సంక్షేమం కోసం కాకుండా సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసమే లక్ష్యంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గద్దం లక్ష్మీనారాయణ రెడ్డి విమర్శించారు. ఇది పూర్తిగా రైతుల వ్యతిరేక ప్రభుత్వమని, ప్రతి చోటా అన్నదాతల ఆగ్రహాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ బుట్టా రేణుక ఆదేశాల మేరకు గురువారం రైతులతో ఆయన ర్యాలీగా వెళ్లి గురురాఘవేంద్ర ఎత్తిపోతల కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యాలయంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారి లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయరంగాన్ని ప్రోత్సహిస్తూ సాగునీరందించేందుకు చర్యలు తీసుకొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్ట్ పనులు ముందుకు కదల్లేదన్నారు. పార్టీ నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు చాంద్‌బాషా, నందవరం మండల ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, సోంపురం గ్రామ సర్పంచ్ నరసింహులు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శాంతిరాజు, చుక్కా మల్లేష్, కూలూరు శేషిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.


గురురాఘవేంద్ర ఎత్తిపోతల కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

న్యూస్‌రీల్

స్వర్ణ తేజం.. 'గురు' వైభవం

- శ్రీమఠంలో ఘనంగా బంగారు పల్లకోత్సవం



భక్తజనం మధ్య బంగారు పల్లకీసేవ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రుల స్వామి బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో కొలువుంచి అశేష భక్తజన వాహిని మధ్య ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి గురువారం ఇరు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి వేలాదిగా భక్తులు వచ్చారు. వేకువజాము నుంచే రాయరు దర్శనానికి బారులు తీరారు. అత్యధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో శ్రీమఠం వీధులన్నీ కిక్కిరిశాయి. రాఘవేంద్రస్వామి మూల బృందావన దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. అశేష భక్తజన వాహిని మధ్య రాఘవేంద్రుల బృందావన ప్రతిమ బంగారు పల్లకోత్సవం వైభవంగా జరిగింది. గ్రామ దేవత మంచాలమ్మ దర్శన క్యూలైన్, అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లలో భక్తుల రద్దీ కనిపించింది.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి చర్యలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి చర్యలు చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తరగతుల్లో సీట్ల ఖాళీల వివరాలను తమకు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల లేదా జిల్లా కేంద్రంలోని డీసీఓ కార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు. ఈ సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామన్నారు. బాలికలకు ఈ నెల 25న దిన్నెదేవరపాడు పాఠశాలలో, బాలురకు చిన్నటేకూరు కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08518- 295601 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

శ్రీశైలానికి 42,205 క్యూసెక్కుల వరద



శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి గత కొద్ది రోజులుగా వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. దీంతో జలాశయంలో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. సెల్ఫ్ క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాజెక్టులైన జూరాల, తుంగభద్రల నుంచి వస్తున్న వరద జలాలతో శ్రీశైలంలో నీటిమట్టం పెరుగుతోంది. బుధవారం నుంచి గురువారం వరకు ఎగువ ప్రాజెక్టుల నుంచి 42,205 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాలలో తాత్కాలికంగా ఉత్పాదనను నిలిపివేశారు. గురువారం సాయంత్రం సమయానికి శ్రీశైలం డ్యాం నీటిమట్టం 847.10 అడుగులకు చేరుకోగా, జలాశయంలో 73.9870 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆలయ కట్ట సాక్షిగా అంటరానితనమా!

- దళిత సర్పంచ్‌కు అవమానంపై నిరసనల హోరు

కర్నూలు(సెంట్రల్): ఆదోని మండలం డాణాపురం దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను ఆలయ కట్టపైకి పిలువకుండా టీడీపీ, బీజేపీ కుల దురహంకారానికి పాల్పడ్డాయని, ఇందుకు బాధ్యులైన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం కలెక్టరేట్ ఎదుట కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా డాణాపురం ఘటనను నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, కేవీపీఎస్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రమణ, ఎ.గురుస్వామి మాట్లాడుతూ ఈ నెల 16న ఆదోని మండలం డాణాపురంలో జరిగిన కూటమి విజయోత్సవ సభలో దళితుడైన ఆ గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్‌ను బీజేపీ ఎమ్మెల్యే బి.పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ తీవ్రంగా అవమానించారన్నారు. ఆలయ అరుగుకట్టపై నిర్వహించిన సభలో దళితుడు కావడంతో పైకి పిలవకపోవడం శోచనీయమన్నారు. ఏకంగా ఎస్సీ సర్పంచ్ పైకి రావడానికి వీల్లేదని గుడిసె కృష్ణమ్మ చెప్పడం, అందుకు ఎమ్మెల్యే సర్పంచ్‌ను కాళ్ల దగ్గర కింద నిల్చోమనడం హేయమైన చర్య అన్నారు. ఆలయ కట్ట సాక్షిగా అంటరానితనం బయటపడిందన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితులు ఏస్థాయిలో అన్యాయానికి గురవుతున్నారో ఈ ఘటన మరోసారి అద్దం పట్టిందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో ఉందని, అంబేద్కర్ రాజ్యాంగమంటే కూటమి నేతలు, పోలీసులకు లెక్కలేకుండా పోతోందన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు , డీహెచ్‌పీఎస్ నాయకులు

ఎమ్మెల్యే వ్యవహార శైలిని తప్పుబట్టిన సీపీఎం

డాణాపురంలో సర్పంచ్ చంద్రశేఖర్‌కు జరిగిన అవమానాన్ని సీపీఎం జిల్లా కమిటీ తప్పుపట్టింది. ఈ మేరకు గురువారం ఆ పార్టీ కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఘటనకు బాధ్యులైన ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వేదిక పైనుంచి ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్ క్రిస్టియనా అని అడగటం, అందుకు ఎస్సీ అంటూ టీడీపీ నాయకులు చెప్పడం అత్యంత ఘోరమన్నారు. అదేవిధంగా ఘటనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, అవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

నాణ్యత 'తారు'మారు


అనుగొండ- ఎర్రదొడ్డి రోడ్డు దుస్థితి

కోడుమూరు రూరల్ : పల్లెపండుగ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి నెలలో హడావుడిగా చేపట్టిన రోడ్ల మర మ్మతులను చూసి ప్రజలు నవ్వుతున్నారు. కోడు మూరు మండలంలోని అనుగొండ నుంచి వెంకటగిరి వరకు ప్యాచ్ వర్క్‌లకు రూ.4లక్షలు, అనుగొండ నుంచి అల్లినగరం మీదుగా లద్దగిరి వరకు రోడ్డు ప్యాచ్‌వర్క్‌ల కోసం రూ.3.50లక్షలను కేటాయించారు. రోడ్ల గుంతలు పడిన ప్రాంతంలో మట్టితో కూడిన కంకర వేసి వాటిపై రోలర్ తిప్పకుండానే తారు వేసేశారు. దీంతో ఆరు నెలలు కూడా గడవకముందే పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు తారు లేచిపోవడంతో రోడ్డంతా యథావిధిగా గుంతలమయంగా తయారైంది. ఇలాంటి రోడ్ల మరమ్మతులు తామెన్నడూ చూడలే దని, ఇంత నాసిరకంగా పనులు చేస్తే ఎలా అంటూ ఆయాగ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఉన్నతాధికారులు వీరిని బదిలీ చేశారు. కర్నూలు అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డి.హరిహరతేజ రాజమండ్రికి, రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానా కాకినాడకు, నంద్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాదా ఖలందర్ చిత్తూరు జిల్లా మదనపల్లెకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో రాయచోటిలో పనిచేస్తున్న జయరాముడు కర్నూలు రూరల్.. అనంతపురం(విజిలెన్స్)లో పనిచేస్తున్న హనుమన్నకు నంద్యాలతో పాటు కర్నూలు అర్బన్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ బదిలీ చేశారు.

అను'గృహం' ఎప్పుడో?

- పేదల గోడు పట్టించుకోని సీఎం చంద్రబాబు
- ఏడాది కాలంలో ఒక్కపేదవాడికీ రాని ఇంటి స్థలం
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న జనం
- స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇళ్లస్థలాలు అందడం లేదు. ఇంటి నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం ఇవ్వడం లేదు. నిలువ నీడలేని ప్రజలు సొంతింటి స్థలం, నిర్మాణాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

ఇదీ హామీ..

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తాము అధికారంలోకి వస్తే పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలం ఇస్తానని హామీ ఇచ్చారు. అంతేకాక ఇంటినిర్మానం కోసం రూ.5 లక్షలు ఇస్తానని వాగ్దానం చేశారు. చంద్రబాబు హామీలపై పేదలు ఎంతో ఆశ పెంచుకున్నారు.

అధికారంలోకి వచ్చి ఏడాదైనా..

అధికారంలోకి రాగానే ప్రమాణ స్వీకరణనంతరం పేదలకు గ్రామీణ ప్రాంతల్లో 3, పట్టణప్రాంతాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తానని, ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు మంజూరు చేస్తానని చంద్రబాబు మరో సారి హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి చెప్పిన విధంగా కాకుండా ఐదు లక్షల్లో ఒక లక్ష రూపాయలను తగ్గించి నాలుగు లక్షలు ఇస్తానని సంతకం పెట్టారు. ఏడాదవుతున్నా హామీ అమలు కాలేదు. దీంతో పేదలకు టీడీపీ నేతలు ముఖం చూపడం లేదు.

ఇదీ జరిగింది..

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పేదలు దరఖాస్తు చేసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఏడాదిగా పేదలు సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒక్కరికీ ఇంటిస్థలం ఇచ్చింది లేదు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ. 4 లక్షలు మంజూరు చేయలేదు. జిల్లాలో ఈ ఏడాది 4 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇంత తక్కువ సంఖ్యలో దరఖాస్తులు ఎందుకు వచ్చాయో ఇటీవల తన సమీక్షలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మరోసారి ప్రజల నుంచి ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు తీసుకోవాలని, ఇంటింటా సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు.

'చంద్ర' గ్రహణం


అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు వైఎస్సార్ జగనన్న కాలనీలకు ఎన్టీఆర్ కాలనీలు అని పేరు మార్చారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రావడానికి లేనిపోని హామీలు ఇవ్వడం..తరువాత వాటిని పట్టించుకోకపోవడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని ప్రజలే విమర్శిస్తున్నారు. అందుకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాల హామీని ఉదాహరణగా చూపుతున్నారు. ఏడాది కాలంలో ఒక్క పేదవాడికి సెంటు స్థలం ఇవ్వకుండా, వారి గోడు పట్టించుకోకుండా ఉండడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలపై తీవ్ర విమర్శలుచేసినా బాబు.. ఇప్పుడు ఎందుకు ఇవ్వడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల స్థలాల కోసం కర్నూలు కలెక్టరేట్ వద్ద మార్చి నెలలో మహిళలు ఆందోళన చేశారు.



వైఎస్సార్‌సీపీ హయాంలో..


గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలు జిల్లాలో 48 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. ఇందులో 39 వేల మందికి పీఎంఏవై అర్బన్-వైఎస్ఆర్ జగనన్న పేరిట ఇళ్లను మంజూరు చేశారు. ఆ ప్రభుత్వం ఉన్నప్పుడే 22 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 16 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.

అద్దె ఇంట్లో ఉంటున్నాం



మాకు సొంతిల్లు లేదు. ఆదాయం కూడా అంతంత మాత్రమే. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నాం. ప్రభుత్వం స్థలం ఇస్తే ఇల్లు కట్టుకోవాలని చూస్తున్నాం. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. దాదాపు ఏడాది కింద ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేశాం. ఇంతవరకు ఏమీ పట్టించుకోలేదు. కనీసం మమ్మల్ని దరఖాస్తు చేశారని కూడా అడగలేదు. రెండు సెంట్ల ఇంటి స్థలం ఇస్తే సంతోషిస్తాం.
– ఎస్.తోహిద్ షేక్ తహమీన్, రోజావీధి, కర్నూలు

పేదలంటే చిన్నచూపు



పేదలంటే అధికారులకు చిన్నచూపు. ఇంటిస్థలం కోసం దరఖాస్తు చేశాం. ఇప్పటి వరకు కనీసం పలకరించలేదు. సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చంద్రబాబు చెప్పిన విధంగా రెండు సెంట్లస్థలం ఇవ్వాలి. లేదంటే ఆయన మాటను మరోసారి నమ్మం.
– లావణ్య, చిత్తరి వీధి, కర్నూలు



ఇళ్లల్లో 'పేడ' పాషాణం!



☛ ఆసుపత్రిలో మంచంపై పడుకున్న ఈ వ్యక్తి పేరు నాగేషులు. ఇతను డోన్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి కుటుంబసమస్యలతో ఇంట్లో ఉన్న కృత్రిమ పేడరంగును నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే కుటుంబసభ్యులు అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారు. అప్పటికే అతని శరీరమంతా పచ్చగా మారిపోయింది.


☛ .. ఇతనొక్కడే కాదు ఇటీవల కాలంలో కృత్రిమ పేడరంగు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కుటుంబసభ్యులు, అప్పులు, సామాజిక సమస్యలు, విద్య, ఉద్యోగం ఎలా సమస్య ఏదైనా ఆత్మహత్య ఒక్కటే పరిష్కారంగా ఆవేశంతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆత్మహత్యాయత్నానికి ఉపయోగపడే వాటిలో ఇప్పుడు కృత్రిమ పేడ రంగు కూడా వచ్చి చేరడం ఆందోళనకరం.

- పేడ రంగు తాగి ఆత్మహత్యాయత్నాలు
- కర్నూలు జీజీహెచ్‌కు నెలకు నాలుగు కేసులు

కర్నూలు(హాస్పిటల్): ఒకప్పుడు ఇంటి ముందు కళ్లాపి చల్లాలంటే ఊళ్లో పశువులు ఉన్న చోటకు వెళ్లి పేడను సేకరించి తెచ్చి, దానిని నీళ్లలో కలిపి ఇంటి ముందు చల్లేవారు. దీనివల్ల ఇంట్లోకి బయట నుంచి క్రిమికీటకాలు, వైరస్‌లు రావని నమ్మకం. ఆధునికత పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు పశువులు విసర్జించే పేడను ముట్టుకోవడానికి నేటితరం ఇష్టపడటం లేదు. పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో పశువుల పేడ లభించడమూ కష్టమైంది. ఈ క్రమంలో కృత్రిమ పేడ రంగు మార్కెట్‌లోకి వచ్చింది. ఆరోమైన్ ఓ డైరైల్‌మెతాన్ అనే రసాయనంతో తయారయ్యే ఈ కృత్రిమ పేడ రంగు ఇటీవల ప్రతి ఊళ్లో, ప్రతి వీధిలోని దుకాణాల్లో విరివిగా లభిస్తోంది. ముఖ్యంగా పండుగలు, శుభకార్యాల సమయంలో పేడకు బదులు ఈ రంగును ఉపయోగించి కల్లాపి చల్లుతున్నారు. దీనివల్ల అచ్చం పేడను కల్లాపి చల్లినట్లుగా ఉంటుంది. అయితే ఇది విషపూరితమైన పౌడర్‌గా వైద్యులు చెబుతున్నారు. పొరపాటుగా దీనిని సేవించిన వారి ప్రాణాలకు కష్టాలు తెచ్చి పెడుతుందని సెలవిస్తున్నారు.

శరీరమంతా విషపూరితం

కృత్రిమ పేడరంగును నీళ్లలో కలిపి ఆత్మహత్యాయత్నం చేసుకునే వారి సంఖ్య ఇటీవల పెరిగిపోతోంది. అందరి ఇళ్లలో, దుకాణాల్లో సులభంగా లభించే ఈ పదార్థంతో ఆత్మహత్యాయత్నానికి ఒడిగడుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చికిత్స కోసం ప్రతి నెలా నలుగురైదుగురు వస్తున్నారు. ఈ కృత్రిమ పేడరంగును సేవించిన వారికి ముందుగా వాంతులు కావడమే గాక ఫిట్స్, కాలేయం దెబ్బతినడం ప్రారంభం అవుతుంది. ఇందులోని విష రసాయనం నేరుగా రక్తకణాల్లోని డీఎన్ఏకు నష్టం చేకూరుస్తుంది. దీంతో పాటు జీర్ణాశయాన్ని దెబ్బతీస్తుంది. కొందరికి భవిష్యత్‌లో మూత్రాశయ, శోషరస(లింపు గ్రంథి) క్యాన్సర్‌లు వచ్చేందుకు అవకాశం ఉంది. కొందరిలో సంతానం కలిగించే సామర్థ్యాన్ని కూడా దెబ్బ తీస్తుంది. దీంతో పాటు తాగిన వారికి శరీరమంతా పచ్చగా మారుతుంది. మూత్రం, చెమట, కళ్లలో నీరు కూడా పచ్చగానే స్రవిస్తాయి. ఇది కంటికి తగిలినా కళ్లు ఎర్రగా మారడం, వాపురావడం జరుగుతుంది.



కృత్రిమ పేడరంగు ప్యాకెట్

మృతుల్లో కొన్ని..

16-01-2025
వివిధ కారణాలతో అవుకు మండలం రామాపురం గ్రామంలో కావలి లక్ష్మన్న(35), చాకలి అనసూయమ్మ(57) , మద్దూరి సుజాత (61) పేడరంగు తాగి మృతి చెందారు.

19-01-2025
కడుపునొప్పి తాళలేక బేతంచెర్ల మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన బోయ నాగలక్షమ్మ (42) పేడరంగు ద్రావణం తాగి బలవన్మరణానికి పాల్పడింది.

03-03-2025
మద్యానికి బానిసై సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన చిట్టిబాబు (29) పేడమందు తాగి మృతి చెందాడు.

19-04-2025
పిల్లల అల్లరి మాన్పించలేక వెల్దుర్తి మండలం ఎల్.కొట్టాలకు చెందిన సుభాషిణి(23)కి పేడరంగు రసాయనాన్ని తాగి బలవన్మరణానికి పాల్పడింది.

విరుగుడు లేదు



ఇటీవల కాలంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి కృత్రిమ పేడరంగును తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుని వస్తున్న వారు పెరుగుతున్నారు. గతంలో ఎప్పుడో ఒకరు మాత్రమే వచ్చేవారు. ఇప్పుడు నెలకు ముగ్గురు, నలుగురు వస్తున్నారు. కృత్రిమ పేడరంగుకు విరుగుడు లేదు. లక్షణాలను బట్టి మాత్రమే చికిత్స అందించాల్సి ఉంటుంది.
–డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు, జీజీహెచ్, కర్నూలు

క్లుప్తంగా

జూలై 25 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు

- ఉరుకుందలో సేవ చేసే వారి కోసం దరఖాస్తుల ఆహ్వానం


ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ముఖద్వారం

కౌతాళం: ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో జూలై 25 నుంచి ఆగస్టు 23 వరకు నెల రోజుల పాటు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శ్రావణమాస ఉత్సవాల్లో లక్షలాది భక్తులు దర్శనానికి వస్తారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా సేవ చేసే వారి కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. క్యూలైన్, అన్నదాన సత్రం, పార్కింగ్, హుండీ కౌంటింగ్ వద్ద, ఇతర చోట్ల సేవలు అందించే వారు ఏఏ తేదీల్లో రాగలరో తెలియజేస్తూ రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాట్సాప్ నంబర్ 9550593339కు వివరాలు తెలపవచ్చన్నారు. ఈ మెయిల్ , పోస్టు ద్వారా దరఖాస్తును పంపవచ్చని తెలిపారు. జూలై 10వ తేదీలో లోపు దరఖాస్తులు రావాలన్నారు.

ఆదోని ఏటీవోగా అనిల్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): ఖజానా, లెక్కల శాఖ ఆదోని డివిజన్ సబ్ ట్రెజరీ ఏటీవోగా బి.అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈయన ఇంతవరకు కర్నూలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కార్యాలయంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈయనను రాష్ట్ర ట్రెజరీస్ డైరెక్టర్ ఆదోని డివిజన్ సబ్ ట్రెజరీ ఏటీవోగా నియమించారు. జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావును గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలసి జాయినింగ్ రిపోర్టు అందచేశారు. ఆదోని ఏటీవోగా పనిచేస్తున్న రమణయ్య జిల్లా ట్రెజరీ కార్యాలయం ఏటీవో నియమితులయ్యారు. ఇక్కడ ఉన్న ఏటీవో జయలక్ష్మి అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


పీసీబీ కార్యాలయ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పీసీబీ జోనల్ ఆఫీసు ఎస్ఈఈ శంకర్ నాయక్, పీసీబీ రీజినల్ అధికారి పి.వెంకట కిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు, కోట్ల విజయభాస్కరరెడ్డి పాఠశాల విద్యార్థులు కలసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో మనిషి తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాడన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్న తనం నుంచే యోగాను పాటిస్తే భవిష్యత్‌లో మంచి ఫలితాలను పొందవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగులను వినియోగించాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ జ్యూట్ బ్యాగులను అందజేశారు. పీసీబీ ఎస్ఈఈ వీరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు పోటెత్తిన వరద

- 51వేల క్యూసెక్కులకు పెరిగిన ఇన్‌ఫ్లో
- 40 టీఎంసీల చేరువలో నీరు



టీబీ డ్యాంలో జలకళ,హొళగుంద వద్ద నీరులేక బోసిపోయిన దిగువ కాలువ(ఎల్లెల్సీ)

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో ఇన్‌ఫ్లో గురువారం ఇంకాస్తా మెరుగుపడింది. గడిచిన వారం రోజుల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. బుధవారం ఇన్‌ఫ్లో 19,265 క్యూసెక్కులు మాత్రమే ఉండి 32 టీఎంసీలకు నీరు చేరగా.. గురువారం 51,654 క్యూసెక్కులకు పెరిగి రాత్రికి నీటి నిల్వ దాదాపు 40 టీఎంసీలకు చేరుకుంది. శుక్రవారం ఉదయం నాటికి ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్కమంగళూరు, వరనాడు తదితర డ్యాం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో డ్యాం ఎగువన నిర్మించిన అప్పర్‌తుంగా ప్రాజెక్ట్(గాజనూరు జలాశయం) నిండటంతో 30వేల క్యూసెక్కుల వరకు నీటిని దిగువకు వదులుతున్నారు. దీనికి తోడు రిజర్వాయర్ పరిసరాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుడడంతో ఇన్‌ఫ్లో మరింత పెరుగుతున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు వెల్లడించారు. త్వరలోనే డ్యాంలో టీబీ బోర్డు అధికారులు నిర్ణయించిన మట్టానికి నీరు చేరే అవకాశాలు ఉండటంతో.. ఈ నెలాఖరు లేదా జూలై మొదటి వారంలో కాలువలకు నీటిని వదలనున్నట్లు తెలుస్తోంది.

ఈ ఏడాది ఒకే పంటకు నీరు

ఇదిలాఉంటే ఈ ఏడాది టీబీ డ్యాం నుంచి ఒక పంటకు మాత్రమే నీరివ్వనున్నారు. గతేడాది 33 క్రస్టు గేటుల్లో 19వ క్రస్టు గేటు కొట్టుకుపోవడం, మిగిలిన 32 గేట్లు కూడా దెబ్బతినడం వల్ల గేట్ల నిపుణుల సూచనల మేరకు వాటిని మార్చాలని టీబీ బోర్డు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో గేట్ల అంచు వరకు 80 టీఎంసీల నీరును మాత్రమే నిల్వ చేసి కాలువలకు వదులుతారు. ఎక్కువ వరద వస్తే నదికి వదిలేయనున్నారు. ఇక డ్యాంలో నీటి నిల్వ 40 టీఎంసీలకు తగ్గిన తర్వాత కొత్త గేట్లను అమర్చనున్నట్లు సమాచారం. వచ్చే ఖరీఫ్ నాటికి గేట్ల బిగింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల జరిగిన ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఇరిగేషన్ ఉన్నతాధికారుల సమావేశంలో కేవలం ఖరీఫ్ సాగుకు మాత్రమే నీరిచ్చేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో కర్నూలు జిల్లాకు సంబంధించి ఎల్లెల్సీ కింద గతేడాది ఖరీఫ్, రబీలో పంటలు పండించిన రైతులు ఈ ఏడాది ఒకే పంటతో సరిపెట్టుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ఎల్లెల్సీ కింద ఖరీఫ్‌లో 43 వేలు, రబీలో లక్షా 7 వేల ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉంది. ఈ ఏడాది ఒకే పంటకు నీరిస్తామని చెబుతుండటం పట్ల రైతుల్లో ఆందోళన మొదలైంది. రెండు పంటలకు నీరివ్వాలని కర్ణాటకలోని తుంగభద్ర రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తుంగభద్ర నదిలో ఇసుక దొంగలు

- ఇసుక చోరులకు టీడీపీ నేతల అండదండలు


తుంగభద్ర నది నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

నందవరం: నాగలదిన్నె గ్రామానికి అనుకొని ఉన్న తుంగభద్ర నదిలో ఇసుకను దొంగతనం చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇసుక చోరులకు టీడీపీ నేతల అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. నందవరం మండలంలో కనకవీడు, పేట గ్రామాల మీదుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. పట్టపగలే ట్రాక్టర్లతో ఇసుకను యథేచ్ఛగా దోచుకెళుతున్నారు. గ్రామస్తులు ఎన్నో సార్లు రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలకు ఫిర్యాదునా చేసినా ఫలితం శూన్యం . నాగలదిన్నె గ్రామం నుంచి రోజుకు 50 నుంచి 100 ట్రిప్పుల వరకు ఇసుక తరలుతోంది. అధికారులకు కనీసం వాల్టా చట్టం అమలు చేయాలన్న ఆలోచన లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

బన్నులు అమ్మేందుకు వచ్చి మృతి


మృతిచెందిన కటిక బాబు

సి.బెళగల్: బన్నులు అమ్ముకుంటూనే ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. గూడూరు పట్టణానికి చెందిన అబ్దుల్ నజీర్ అలియాస్ కటిక బాబు (60) బన్నులు, గట్టాలు, పిప్పరమెంట్లు తదితర చిరుతిండి వస్తువులను స్కూటర్‌పై గూడూరు, సి.బెళగల్ మండాల్లోని గ్రామాల్లో అంగళ్లలో అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. రోజులాగే గురువారం సి. బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామంలో బన్నులను అంగళ్లకు అమ్ముకుంటున్న సందర్భంలో గుండెపోటుతో అస్వస్థతకు గురై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. గమనించిన స్థానికులు కటిక బాబు కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. అబ్దుల్ నజీర్‌కు భార్య బడేబీ, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని చింతకుంట రోడ్డులోని బాలసదన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని కొత్త మసీదు వీధికి చెందిన షరీఫ్ (50) కోవెలకుంట్ల మండలం రేవనూరులోని దస్తగిరిస్వామిని దర్శించుకునేందుకు వెళ్లాడు. తిరిగి బైక్‌పై ఆళ్లగడ్డకు వస్తుండగా బాలసదన్ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందగా వెనుకనున్న రాధాకృష్ణ అనే వ్యక్తి స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మస్కట్ నుంచి క్షేమంగా..

ఆళ్లగడ్డ: 'బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లి అక్కడ చిక్కుకుపోయానని, తనను కాపాడాలని వేడుకున్న ఓ మహిళను ఆళ్లగడ్డ పోలీసులు స్వగ్రామానికి సురక్షితంగా చేర్చారు. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రికి చెందిన హుస్సేనమ్మ అనే వితంతు మహిళ బతుకు దెరువు కోసం ఓ ఏజెంట్ ద్వారా మస్కట్ వెళ్లింది. అక్కడ ఓ ఇంట్లో పనికి కుదిరింది. అయితే వంట చేస్తుండగా దుస్తులకు నిప్పంటుకుని కడుపుకు గాయమైంది. పనిచేయలేక పోవడంతో యజమాని ఆమెను పనిలో నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేసినా ఎక్కడా ఉద్యోగం లభించక ఆరోగ్యంతో పాటు ఆర్థిక పరిస్థితి క్షీణించింది. ఇక అక్కడ ఉండలేక తీవ్రమైన మనస్తాపంతో బతకలేనని.. తనను కాపాడాలని సెల్ఫీ వీడియో తీసి నంద్యాల ఎస్పీకి పంపించింది. వెంటనే ఎస్పీ ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, సీఐ మురళీధర్‌రెడ్డిలను అప్రమత్తం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విచారించిన పోలీసులు సంబంధిత ఏజెంట్‌ను గుర్తించి వారితో విమాన టికెట్ బుక్ చేయించి ఆమెకు తిరుగు ప్రయాణ ఏర్పాట్లు చేసి రెండు రోజుల్లోనే బాధితురాలును కుటుంబం వద్దకు సురక్షితంగా చేర్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

వేతనాల కోసం 23న నిరసన

కర్నూలు(సెంట్రల్): పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్ల వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ 23వ తేదీన ఎంఈఓ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు సంబంధిత పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లు ఆందోళనలో పాల్గొనాలని కోరారు.

'ఉపాధి' పనుల్లో భారీగా అవకతవకలు


గూడూరులో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న పీడీ వెంకటరమణయ్య

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు నిగ్గు తేల్చారు. బుధ, గురువారం గూడూరులో ఉపాధి పీడీ వెంకటరమణయ్య ఆయా గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. బూడిదపాడులో రూ.78,681, చనుగొండ్లలో రూ.5,41, 934, గుడిపాడులో రూ.1,44,757, జూలకల్‌లో రూ.4,66,731, కె.నాగలాపురంలో రూ.2,10,406, మల్లాపురంలో రూ.3,52,220, మునగాలలో రూ.1,52,605, పెంచికలపాడులో రూ.రూ.1,85,637, ఆర్.ఖానాపురంలో రూ.5,834 చొప్పున చేసిన పనుల విలువ కంటే అధికంగా డబ్బులు ఖర్చు చేసినట్లు తేల్చారు. పీడీ వెంకటరమణయ్య మాట్లాడుతూ రూ.21,38,805 ఎక్కువగా చెల్లించారని, ఈ డబ్బులను రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జరిమానాగా విధించిన రూ.29వేలను కూడా రికవరీ చేయాలన్నారు.

కులుమాలలో విషాదం

- స్తంభంపై నుంచి పడి భర్త మృతి
- పురిటి నొప్పులతో భార్య ఆస్పత్రిలో చేరిక


కడపల చంద్రశేఖర్ (ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని కులుమాల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ స్తంభంపై నుంచి కింద పడి గోనెగండ్లకు చెందిన కడపల చంద్రశేఖర్ (30) అనే వ్యక్తి మృతిచెందాడు. అదే సమయంలో అతని భార్య భారతి పురిటి నొప్పులతో ఎమ్మిగనూరు ఆస్పత్రిలో చేరింది. వివరాలు.. మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన కడపల చంద్రశేఖర్‌కు భార్య కడపల భారతి, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన భార్య భారతి గర్భవతి. చంద్రశేఖర్ గురువారం కూడాకులుమాల గ్రామ శివారులో రైతు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే పనుల నిమిత్తం స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తూ స్తంభంపై నుంచి కింద ఉన్న ట్రాక్టర్ ట్రాలీ మీద పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇదే సమయంలో అతని భార్య భారతి పురిటి నొప్పులతో ఎమ్మిగనూరు ఆస్పత్రిలో చేరింది. మృతిని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని సీఐ విజయభాస్కర్ తెలిపారు.

రెండు ప్రైవేట్ బస్సులు ఢీ

డోన్ టౌన్: బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న రెండు ప్రైవేట్ బస్సులు దేవరబండ గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున ప్రమాదానికి గురయ్యాయి. జాతీయ రహదారిపై ట్రాక్టర్ మరమ్మతులకు గురై నిలిచిపోయింది. వేగంగా వస్తున్న ప్రైవేటు బస్సు గుర్తించి అకస్మాత్తుగా కుడి వైపు తిప్పడంతో వెనుక వస్తున్న మరో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు గాయాలు కావడంతో అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాసెట్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: ఏపీ లాసెట్ -2025 ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. 3 సంవత్సరాల కోర్సు చదివేందుకు కర్నూలు జిల్లాలో 687 మంది పరీక్ష రాయగా 674 (98.11శాతం) మంది, నంద్యాల జిల్లాలో 537 మంది పరీక్ష రాయగా 530 (98.70శాతం) మంది అర్హత సాధించారు. అలాగే 5 సంవత్సరాల కోర్సు చదివేందుకు కర్నూలు జిల్లాలో 132 మంది పరీక్ష రాయగా 123(93.18 శాతం) మంది, నంద్యాల జిల్లాలో 114 మంది పరీక్ష రాయగా 104 (91.23 శాతం) మంది అర్హత సాధించారు.

గోడౌన్ వీడి బయటకు వచ్చిన శనగలు, జొన్నలు


రైతులకు శనగలు అందజేస్తున్న పోలీస్ అధికారులు

చిప్పగిరి: కొన్ని వివాదాలతో గోడౌన్‌లోనే ఉండిపోయిన శనగలు, జొన్నలు గురువారం బయటకు వచ్చాయి. కోర్టు ఉత్తర్వుల మేరకు పంట ఉత్పత్తులను గురువారం రైతులకు ఇచ్చినట్లు సీఐ రవి శంకర్ రెడ్డి, చిప్పగిరి ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు తెలిపారు. చిప్పగిరిలోని మారుతీ ఫార్మర్ వేర్ హౌస్‌లో బసవన్న గౌడ్, సుధాకర్, లేపా, రాములు తదితరులతో పాటు మొత్తం 17 మంది రైతులు 325 క్వింటాళ్ల శనగలు, 3,103 క్వింటాళ్ల జొన్నలు నిల్వ ఉంచారు. పలు వివాదాల కారణంగా శనగలు, జొన్నలను రైతులు తీసుకోకుండా చేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు రైతులకు వారికి సంబంధించిన శనగలు, జొన్నలను పంపిణీ చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డీఐపీఆర్ సబార్డినేట్ మృతి


బంగి నాగరాజు (ఫైల్)

నందికొట్కూరు: మిడుతూరు మండల పరిధిలోని రోళ్లపాడు మలుపు వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో డీఐపీఆర్ సబార్డినేట్ నాగరాజు (39) మృతి చెందారు. మిడుతూరు ఎస్ఐ ఓబులేసు తెలిపిన వివరాల మేరకు.. నందికొట్కూరు పట్టణానికి చెందిన బంగి నాగరాజు కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సబార్డినేట్‌గా పని చేస్తున్నారు. ఉదయం విధులకు వెళ్తుండగా ఇంటి నుంచి బైక్‌పై బయల్దేరగా మార్గమధ్యలో రోళ్లపాడు మలుపు వద్ద అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలై మృత్యువాత పడ్డారు. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. డీఐపీఆర్ సబార్డినేటర్ మృతి సమాచారం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందించాలని డీపీఆర్ఓ, నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

REQUIRED STAFF
• Sales Executive
• Marketing Executive
• Receptionist
• System Operator
• Technicians
• Service Advisor
• Coustomer Relationship Manager
R & M SUZUKI
Dhone, Cell:6302805829

WANTED TEACHERS
Urgently Required Teachers for IIT & NEET Foundation Program for VI to X Classes
Maths, Physics, Chemistry, Biology
Salary Negotiable (Free Food & Accommodation)
Whatsapp your resumes to 9182419990, 9440784735
TA and DA will be provided for those who are selected for the interview.
ST.MARK'S EM HIGH SCHOOL
PAMURU, PRAKASAM (Dt).

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ఆర్.ఆర్.హై స్కూలు, మద్దూర్ నగర్, కర్నూలు వారి ఎడ్యుకేషనల్ సొసైటీ తరఫున 1వ తరగతి నుండి 10వ తరగతి పేద విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించబడును. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఫీజులో 50% రాయితీ ఇవ్వబడును. సంప్ర: ఉమాదేవి. సెల్: 9440290162. [SCA25004967]

WANTED

■ కర్నూలులోని ప్రముఖ హాస్పిటల్‌లో జాబ్ చేయుటకు డ్యూటీ డాక్టర్స్ (BHMS/BUMS), స్టాఫ్ నర్స్ (GNM) కావలెను. సెల్: 94914 91911. [SCA25005171]

■ Wanted Teachers (Nursery to UKG). Contact: Vijetha High School, Near krishna nagar ITC, kurnool. Send your resume via whatsapp to: 94921 98651. [SCA25005046]

■ బ్రైట్ త్రూ EM స్కూల్, శరీన్ నగర్, కర్నూలు. హైస్కూలుకు ఇంగ్లీష్, సైన్స్, సోషల్ బోధించుటకు లేడీ టీచర్లు మరియు పనిచేయుటకు వాచ్‌మెన్‌లు కావలెను. సెల్:85007 79895, 83743 37750 [SCA25005152]

■ Wanted Experienced Teacher for Social Studies. Vijetha High School, Near Krishna Nagar ITC, Kurnool. Send your resume via Whatsapp : 94921 98651. [SCA25005177]

■ ప్రముఖ SML షోరూంలో పనిచేయుటకు సిస్టమ్ ఆపరేటర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మెకానిక్స్, ఎలక్ట్రీషియన్ కావలెను. సంప్రదించండి: కర్నూలు. సెల్: 94405 80868, 90598 55449. [SCA25005189]

■ Wanted Telecallers only for females Best educational services. Salary 10 to 15k. Address: Birla Compound, Bramha Reddy hospital. Kurnool. Contact: 79815 04479, 77999 99859 [SCA25005200]

■ Tele Callers (girls) Qly : degree Salary:-15k (with incentive), Adress:- Ballary Chowrastha, Skandhanshi Complex, D Mart beside, Kurnool. Contact: 93912 20645, 90636 43092. [SCA25005155]

■ శ్రీ శక్తి Co-Operative Society నందు పనిచేయుటకు Field Staff కావలెయును. Qly: Any Degree, Sal 15-18K, Address: I Con Shoppee Complex, 4th Floor, Birla Compound (Union Bank Complex), Ph: 83413 80122, 95027 66466 [SCA25005146]

■ Work from home మా కంపెనీ అడ్వర్టైజ్మెంట్లు పంపుటకు స్త్రీ/పురుషులు కావలెను. వారానికి 3500 సంపాదించుకోండి వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి వివరాలకు కాల్ చేయండి. Cell: 82478 08801 [SCA25005052]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు- 40 వేలు,ఫ్రీరూం+భోజనం.HYD.Ph:7993583999 [HA-15928]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165